క్లుప్తంగా

టెన్నికాయిట్‌లో విద్యార్థినుల ప్రతిభ



మండవల్లి: జంగారెడ్డిగూడెంలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ టెన్నికాయిట్ అండర్–14 పోటీల్లో జిల్లా తరఫున కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారని హెచ్‌ఎం ఎన్‌వై మాధవకుమార్ బుధవారం తెలిపారు. విద్యార్థినులు ఎల్.రుక్మిణి, ఎస్.కావ్య, జి.సౌమ్యకీర్తి పాల్గొని తృతీయ స్థానం పొంది కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. విజేతలను, పీడీ కె.సత్యనారాయణను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో కె.శ్యాంప్రసాద్, మూర్తి పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతిరూపం రమాబాయి అంబేడ్కర్

మండవల్లి: త్యాగానికి ప్రతిరూపం రమాబాయి అంబేడ్కర్ అని, ఆమె త్యాగాలు ఆదర్శనీయమని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు, అంబేడ్కర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు, జైభీమ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు వి.సుధీర్ అన్నారు. అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతిని మండల్లి గ్రంథాలయం వద్ద నిర్వహించారు. తొలుత గ్రంథాలయాధికారి షేక్ పర్వీన రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శాంతరాజు



మండవల్లి: బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొరపాటి శాంతరాజు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గ్రామస్తుల సమక్షంలో నూతన కమిటీ నియామకం బుధవారం జరిగింది. ఇప్పటి వరకు అధ్యక్షుడిగా ఎల్ఎస్ భాస్కరరావు ఉన్నారు. నూతన కమిటీ ఉపాధ్యక్షుడిగా పాగొల్లు అభిష, ఉపాధ్యక్షులుగా బేతపూడి తంబి, కార్యదర్శిగా కొండపల్లి రవి, జాయింట్ సెక్రెటరీగా వి.సుధీర్, ట్రెజరర్‌గా డి.వినోద్, ఎక్జిక్యూటివ్ సభ్యుడిగా మెండా రాజేష్ ఎంపికయ్యారు.

నులి పురుగుల నివారణ మందుల పంపిణీ

గుడ్లవల్లేరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులను ఎంఈఓలకు వైద్యులు అందించారు. నులి పురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఈ కార్యక్రమాన్ని గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత నులి పురుగుల నివారణ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీనివాస్, ఎంఈఓ జి.గోపాలరావు, కార్యదర్శులు నరసింహారావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: అంతర్ రాష్ట్ర ఇన్విటేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి ఆరు పతకాలు సాధించారని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 4వ తేదీ బాపట్లలో జరిగిన ఈ పోటీల్లో తమ విద్యార్థులు వివిధ విభాగాల్లో బి.జశ్వంత్, జి.భువనేష్ , టి.హేమంత్, కె.వేదశ్రీ నాగేంద్రకుమార్ ప్రథమ స్థానాలు సాధించారని పేర్కొన్నారు. కె.అయాన్‌జేస్ ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో సీహెచ్. భావగ్న తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను, కోచ్ ఎస్. వెంకటేశ్వరరావును పాఠశాల ప్రిన్సిపాల్స్ ఎస్. సత్యారామ్, జ్యోతి, జబ్రీనా అభినందించారు.

భాషా సేవా రత్న అవార్డు గ్రహీతకు సన్మానం



పామర్రు: సామాజిక సేవా కార్యకర్త పీఎంఎస్ ప్రసాద్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాషా సేవా రత్న అవార్డును ప్రదానం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక బ్రాహ్మణ సేవా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ప్రసాద్ గిరిజ దంపతులను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ సభ్యులు మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి ప్రసాద్ చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం సేవా రత్న అవార్డు ఇవ్వడం అభినందనీయమన్నారు. 40 ఏళ్లుగా జర్నలిజంలో ఉంటూ ఎన్నో విషయాలపై విశ్లేషణలు చేస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. ప్రముఖ వైద్యురాలు సంఘ సభ్యురాలు రొంపిచర్ల కాశీ విశాలక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు బి.సుబ్బారావు, జీ సుబ్రమణ్యం, బి.శ్రీనివాస శాస్త్రి, టీ శివ ప్రసాద్, ఆర్.రంగప్రసాద్, రంగవల్లి, జీ కామేశ్వరీ, బి. కనకదుర్గదేవి, పద్మలత పాల్గొన్నారు.

ఆసరాతో డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా

పాదయాత్రలో భాగంగా డ్వాక్రా మహిళల సమస్యలను తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే వారికి రుణమాఫీ చేస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా నాలుగు విడతలు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నూటికి నూరుశాతం నేరవేర్చడం ద్వారా డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. గుడివాడ నియోజకవర్గంలో నాలుగు విడతలుగా 15,321 గ్రూపుల్లోని 1,49,265 మంది సభ్యులకు రూ.136.04 కోట్లు డ్వాక్రా రుణాల మాఫీ చేసి మాట తప్పని నేతగా పేరుగడించారు.



డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని (ఫైల్)

- ఇచ్చిన మాట నెరవేర్చుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- గుడివాడ నియోజకవర్గంలో రూ.136.04 కోట్ల రుణమాఫీ

గుడివాడరూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిన సందర్భాల్లో డ్వాక్రా మహిళలు తమకు ఉన్న సమస్యలను ఆయన ముందు ఏకరువు పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా మహిళలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించి పురుషులతో సమానంగా మహిళలు ఉండాలని ఆకాంక్షించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు తీసుకున్న డ్వాక్రా రుణాలను దశలవారీగా రుణమాఫీ చేస్తానని మహిళలకు హామీ ఇచ్చారు. వాస్తవానికి గత టీడీపీ హయాంలో డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలకు అప్పటి ప్రభుత్వం పసుపు, కుంకుమ పేరిట ఒక్కో గ్రూపునకు రూ.10వేలు చొప్పున రెండు విడతలుగా ఇచ్చి చేతులు దులుపుకుంది. దీనివల్ల డ్వాక్రా మహిళలకు ఒరిగింది శూన్యం. బ్యాంక్‌ల నుంచి రుణాలు తీసుకున్న మహిళలు అప్పటి ప్రభుత్వ హయాంలో వడ్డీతో సహా రుణాలను కట్టడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం నుంచి వారికి ఆర్థిక భరోసా కరువైంది. పాదయాత్రలో భాగంగా డ్వాక్రా మహిళల సమస్యలను తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే అప్పటి వరకు రుణాలు తీసుకున్న వారందరికీ నాలుగు విడతలుగా తీసుకున్న రుణాల మొత్తాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఇప్పటి వరకు నాలుగు విడతల్లో డ్వాక్రా మహిళల ఖాతాల్లో నగదు జమ చేసి, వారికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక భరోసా కల్పించారు.

మాట నిలబెట్టుకున్న ఏకైక సీఎం జగనన్న



డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నాలుగు విడతల్లో రుణమాఫీని డ్వాక్రా మహిళల ఖాతాలో జమ చేయడం హర్షణీయం. గత ప్రభుత్వాలు చేయలేని పనులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి డ్వాక్రా మహిళలు రుణపడి ఉంటారు.

– తోట నాగమునిమ్మ, డ్వాక్రా మహిళ, చిరిచింతల

మహిళల పక్షపాతి సీఎం జగన్



తండ్రి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మాదిరిగానే తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళల పక్షపాతిగా నిలిచారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ నాల్గో విడత డ్వాక్రా రుణమాఫీ చేసి డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి జగన్‌కు డ్వాక్రా మహిళలు అండగా ఉంటాం.

– మట్టా భాగ్యలక్ష్మి, డ్వాక్రా మహిళ, దొండపాడు

గుడివాడ నియోజకవర్గంలో రుణమాఫీ వివరాలు..

	గ్రూపులు	సభ్యులు	నగదు
మొదటి విడత 2020–21			
గుడివాడఅర్బన్	1,354	12,643	రూ.11.73 కోట్లు
గుడివాడరూరల్	697	7,100	రూ.5.62 కోట్లు
గుడ్లవల్లేరు	975	9,959	రూ.9.77కోట్లు
నందివాడ	795	8,043	రూ.6.80కోట్లు
రెండో విడత 2021–22			
గుడివాడ అర్బన్	1,354	12,643	రూ.11.73 కోట్లు
గుడివాడరూరల్	698	6,932	రూ.5.65 కోట్లు
గుడ్లవల్లేరు	975	9,589	రూ.9.77 కోట్లు
నందివాడ	790	7,853	రూ.6.79 కోట్లు
మూడో విడత 2022–23			
గుడివాడ అర్బన్	1,365	12,765	రూ.11.77కోట్లు
గుడివాడరూరల్	698	6,932	రూ.5.62కోట్లు
గుడ్లవల్లేరు	974	9,577	రూ.9.77కోట్లు
నందివాడ	790	7,853	రూ.6.79కోట్లు
నాల్గో విడత 2023–24			
గుడివాడ అర్బన్	1,393	13,014	రూ.12.07కోట్లు
గుడివాడరూరల్	698	6,932	రూ.5.62కోట్లు
గుడ్లవల్లేరు	974	9,577	రూ.9.77కోట్లు
నందివాడ	790	7,853	రూ.6.79కోట్లు
మొత్తం	15,321	1,49,265	రూ.136.04కోట్లు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఎమ్మెల్యే కొడాలి నాని



నిర్వాహకులతో ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగపరచుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. బుధవారం స్థానిక కాకర్ల వీధిలో పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ ప్రగతి యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పేపర్ ప్లేట్స్ తయారీ విభాగాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టౌన్ లెవల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు మాదాసు వెంకట లక్ష్మీకుమారి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ లక్ష్మీ రంగనాయకమ్మ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు జ్యోతుల సత్యవేణి, అల్లం సూర్యప్రభ, సీఎంఎం సుజాత పాల్గొన్నారు.

భైరవపట్నంలో వైద్యశిబిరం

మండవల్లి: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, తక్కెళ్లపాడు పీహెచ్‌సీ డాక్టర్ సుమ సంయుక్త ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సహకారంతో భైరవపట్నంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ సుమ మాట్లాడుతూ హెచ్ఐవీ అంటు వ్యాధి కాదని, సోకినవారు మందులు వాడుకుంటూ తమ జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. సూపర్‌వైజర్ బి.రాకేష్ మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన వారిని హేళన చేయడం, అవమానపర్చడం చేస్తే మూడు నెలలు నుంచి రెండు సంవత్సరాల పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందని చెప్పారు. సర్పంచ్ ఎస్ఆర్ నాగేంద్రరావు, కార్యదర్శి ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ కె.భాస్కర్, ఏఎస్ఎం టి.జ్యోతి, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

ఫిల్టర్‌బెడ్ పనుల పరిశీలన

మండవల్లి: స్థానిక మొగలి చెరువు ఫిల్టర్‌బెడ్ పనులను బుధవారం సర్పంచ్ మెండా ఝాన్సీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్నందున ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా వాటర్ ట్యాంక్‌కు సంబంధించిన ఫిల్టర్‌బెడ్ వంటి పనులను పూర్తిస్థాయిలో చేపడుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

తోట్లవల్లూరు: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి పోలీసులకు పట్టుబడిన ఘటన మండలంలోని గరికపర్రులో జరిగింది. గ్రామానికి చెందిన బోలెం మల్లేశ్వరరావు అక్రమ మద్యం తరలిస్తుండగా యాకమూరు–గరికపర్రు మధ్యలో బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు. అతని వద్ద నుంచి 19 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రింటర్ వితరణ

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ హైస్కూల్ విద్యార్థులకు 1976–77 బ్యాచ్ పూర్వవిద్యార్థులు సుమారు రూ.8వేల విలువ కలిగిన ప్రింటర్‌ను వితరణగా అందించిన్నట్లు హెచ్‌ఎం. హరికిషోర్ బుధవారం తెలిపారు. నందమూరి సుబ్బారావు అనే దాత రూ.10వేలను బ్యాంక్‌లో డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు. రాబేయే విద్యాసంవత్సరంలో తెలుగు సబ్జెక్ట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి రూ.10వేల పై వచ్చిన వడ్డీని వితరణగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రజలకు చేరువలో ప్రభుత్వ సేవలు

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సుధారాణి, ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్(నందివాడ): ప్రభుత్వ సేవలు, సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంలో భాగమే గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. నందివాడ మండలం పెదలింగాల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డు వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలు ఏర్పాటు యొక్క ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకు చేరవేయడమేనని పేర్కొన్నారు. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థ ద్వారా ఏ విధమైన ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు కాని, సరిఫికెట్లు గాని, భూ సంబంధిత వివరాలు తదితరాలు ప్రజలకు చేరువచేస్తున్నామన్నారు. ఇది కనిపించని అభివృద్ధి అన్నా రు. హెల్త్ క్లినిక్‌లు సైతం ప్రజలకు చేరువచేస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. కావున అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రజలు తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకే పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయరాజు, ఎంపీడీఓ వీఎస్ నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, ఎంపీపీ పెయ్యల ఆదాం, వైస్ ఎంపీపీ పూడి సుధాకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కందుల దుర్గాకుమారి, ఎంపీటీసీ సభ్యులు గోవాడ నిర్మలకుమారి, బొడ్డుపల్లి రంగమ్మ, పెదలింగాల, చినలింగాల, చేదుర్తిపాడు గ్రామ సర్పంచ్‌లు కలపాల సుధారాణి, దాసం చినరాంబాబు, బొల్లం వేణుగోపాలరావు, మార్కెట్ యార్డు చైర్ పర్సన్ మట్టా నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషన్, పాలడుగు రామ్‌ప్రసాద్, మెరుగుమాల కాళీ, కొండపల్లి కుమార్‌రెడ్డి, దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కలపాల నాగేశ్వరరావు, కోగంటి స్వామి, జి ప్రకాశం, పుట్టి సుబ్బారావు, తుమ్మలపల్లి సతీష్ పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ప్రారంభం

నందివాడ మండలం పుట్టగుంటలో నూతనంగా ఏర్పాటు చేసి 33/11 విద్యుత్ ఉపకేంద్రాన్ని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పరిసర ప్రాంతాల్లో ఆక్వాసాగు చేసే రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.4.50 కోట్లతో ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. దీనివలన ఆర్వా రైతులకు పూర్తి సామర్థ్యంలో విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడితే రైతుకు నష్టం కలుగుతుందని వారి విన్నపం మేరకు దీనిని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఈఈ టి.రామకృష్ణ, ఏడీఈ వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌ఫారమ్ ఈఈ ఆర్.రవికుమార్, ఏఈ ఫణీంద్ర పాల్గొన్నారు.

అన్ని పార్టీల నాయకులు ఎన్నికలకు సహకరించాలి

ఎన్నికల ఈఆర్వో షాయిద్ బాబు



అన్ని పార్టీల నాయకులనుద్దేశించి మాట్లాడుతున్న ఈఆర్వో షాయిద్ బాబు

పామర్రు: రానున్న ఎన్నికలకు అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు సహకరించి ప్రశాంతంగా జరిగేలా చూడాలని పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి షాయిద్ బాబు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికలపై అన్ని పార్టీల నాయకులతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఏమైనా సవరణలు ఉంటే తుదిదశలో మార్పుదల చేసుకోవచ్చన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అన్ని పార్టీల నాయకులు ఓటర్ల జాబితాలో వివరాలను సరి చూసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో బూత్‌లను సక్రమంగా ఉన్నాయో లేవో సరి చూసుకోవాలని, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బీఎల్ఓ తమ పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఆర్వో శ్రీదేవి, తహసీల్దార్లు పరమట శ్రీపల్లవి, కుసుమ, మాధవరావు, సత్యనారాయణ, వెంకటలక్ష్మీ, పామర్రు డీటీ నాగమల్లేశ్వరరావు, ఎన్నికల డీటీ జగన్‌మోహన్‌రావు, ఎన్నికల సూపర్‌వైజర్ ఏ రాము పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం జగనన్న ధ్యేయం



మందుల కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని 11, 12 వార్డు సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 వైద్యశిబిరాలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వలన ప్రజలకు వైద్యం చేరువైందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మరోసారి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యపరీక్షలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పేదల నుంచి భారీ స్పందన వస్తున్నట్లు వారు పేర్కొన్నారు. స్థానిక 11వ వార్డులో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను శిబిరాన్ని ప్రారంభించారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చింతల భాస్కరరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, అబ్దుల్ సయ్యద్ తదితరులు పాల్గొని రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. స్థానిక 12వ వార్డులో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, సచివాలయాల ఇన్‌చార్జ్ ఎ.కృష్ణమోహన్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు టీవీ రమణకుమార్ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో డాక్టర్ జీజేడీ ట్విన్సన్, డాక్టర్లు సుమ, కృష్ణగిరీష్, జీవీ రమణ, తేజస్విని, శ్రీశృతి, కిరణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాలిగ్రఫీలో టీచర్ల సత్తా



విజయాంబిక



కె. ఝాన్సీ



జె. కుసుమకుమారి



కె. ఉషాకుమారి

జురువరం (పామర్రు): గ్రామంలోని ఉషోదయ హైస్కూల్ ఉపాధ్యాయులు నలుగురు కాలిగ్రఫీ రాష్ట్రస్థాయి చేతిరాత పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని అఖిల భారత హ్యాండ్ రైటింగ్ అసోసియేషన్ కార్యదర్శి మేకపాటి హర్షిత తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత నెల 28వ తేదీ జాతీయ చేతిరాత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయుల్లో చేతిరాతలో ప్రతిభను గుర్తించేందుకు విద్యతో పాటు విషయ పరిజ్ఞానంపై ప్రతి మూడేళ్లకోసారి అఖిల భారత కాలిగ్రఫీ హ్యాండ్ రైటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు పోటీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 418 స్కూల్స్ సంబంధించిన ఉపాధ్యాయులు పాల్గొన్నారన్నారు. అందులో 30 మంది ఉపాధ్యాయులు విజేతలుగా నిలిచారని తెలిపారు. కృష్ణాజిల్లా జురువరం గ్రామంలోని ఉషోదయ స్కూల్‌కి చెందిన నలుగురు టీచర్లు టి. విజయాంబిక, కె.ఝాన్సీ, జె.కుసుమకుమారి, కె.ఉషాస్రవంతి ఎంపికయ్యారన్నారు. త్వరలో వీరికి ఈ అవార్డులను రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ అందజేస్తారని తెలిపారు. విజేతలను ఉషోదయ ప్రిన్సిపాల్ ఎండీ రఫీ అభినందించారు.

ప్రతిభ గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ఉత్తమ ప్రతిభ కబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేస్తున్న సంస్థ సభ్యులు

అడ్డాడ(పామర్రు): పామర్రు మండలంలోని అడ్డాడ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో 9,10, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం నగదు బహుమతులను అందజేశారు. పామర్రు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సేవా సంస్థ అధ్యక్షుడు ఐవీఎస్ మనోహర్, కార్యదర్శి పామర్తి వెంకట నారాయణ, హైస్కూల్ హెచ్‌ఎం దొంతు పద్మావతి చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభ కనబర్చిచిన ఎనిమిది మంది విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులకు కెరీర్‌గైడెన్స్ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు పామర్తి వెంకట నారాయణ వితరణతో 100 మందికి వివేకానంద పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పుస్తకాలను అందజేశారు. విద్యతో పాటు నైతిక విలువలు కూడా విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు పొట్లూరి నాని బాబు పాల్గొన్నారు.

అనివేటి మండపం పనుల పరిశీలన



మండపం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద జరుగుతున్న అనివేటి మండపం పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సమీప జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా అతిపెద్ద అనివేటి మండపాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండపం లోపల శిల్పాలను సుందరంగా తయారు చేశారన్నారు. కార్యక్రమంలో డీఎన్నార్ కుమారుడు దూలం వీర శ్యామ్ ఫణికుమార్, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, కొల్లేరు నాయకులు బలే సముద్రుడు, మేడిశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన బాలుడి కుటుంబ సభ్యులకు అండగా ఉంటా

- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని
- తక్షణ సాయం కింద రూ.50 వేలు అందజేత



బాలుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడరూరల్: ఇటీవల ప్రమాదవశాత్తు తండ్రి ఆటో కింద పడి బాలుడు మృతి చెందిన విషయం మోటూరులో జరిగింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మోటూరు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కి పార్టీ నాయకులు, కార్యకర్తలు బాలుడు మృతి చెందిన విషయాన్ని తెలుపగా, వెంటనే ఆ బాలుడి ఇంటికి ఎమ్మెల్యే కొడాలి నాని వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనవరి 31వ తేదీన సాయంత్రం ప్రమాదవశాత్తు మురళీ కుమారుడు రిషిక్ ఆటో కింద పడి మృతి చెందడం బాధాకరమన్నారు. బాలుడు తండ్రి మురళీ అద్దెకు ఆటో తీసుకుని జీవనం సాగిస్తున్నానని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కొడాలి నాని రూ.50 వేల సాయం అందజేశారు. బాధలో ఉన్న తమను పరామర్శించడమే కాకుండా, జీవనోపాధికి సాయం అందించిన ఎమ్మెల్యేకు రిషిక్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొరగంటి పద్మ, ఎంపీటీసీ సభ్యురాలు గొర్రె వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు గంటా సురేష్, కొరగంటి పండు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఇమ్మడి అశోక్‌కుమార్, ఇమ్మడి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుది ప్రముఖ పాత్ర



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ సుశ్రుత

గుడ్లవల్లేరు: నరాల క్షీణత రుగ్మతల చికిత్సకు కృత్రిమ మేధస్సు ప్రముఖ పాత్ర వహిస్తుందని దక్షిణ కొరియా కొంకర్ విశ్వవిద్యాలయం బయో మెడికల్ అండ్ హెల్త్ సైన్సెస్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుశ్రుత అన్నారు. ఈ అంశంపై బుధవారం గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ గుడ్లవల్లేరు శాఖ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. కృత్రిమ మేధస్సుతో పనాల క్షీణత రుగ్మతలకు చికిత్సను అందించే విధానాలపై డాక్టర్ సుశ్రుత వివరించారు. మెదడుపై దుష్ప్రభావాలు చూపే ఎన్నో వ్యాధులు ఈ కాలంలో ప్రబలుతున్నాయన్నారు. వీటి చికిత్సకు నూతన ఔషధాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నిషేధించిన ఔషధాల నుంచి నూతన ఔషధాలను రూపొందించటంలో కృత్రిమ మేధస్సు ఎంతో ఉపయుక్తమవుతుందన్నారు. తొలుత సదస్సును ఆమె చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో దక్షిణ కొరియా సూచింగ్ విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.స్పందన రాజేంద్ర, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు పాల్గొన్నారు.